క్లుప్తంగా

ప్రశాంతంగా టెట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ టెట్ –2024 పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి షిఫ్టులో 100 మందికి 87 మంది, రెండో షిఫ్టులో 88 మంది హాజరయ్యారు. విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

వయోజన విద్యకు ప్రాధాన్యత



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వయోజన విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. వయోజన విద్యపై కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం ఆయన సమీక్షించారు. ఉల్లాస్ అనే కార్యక్రమం ద్వారా ప్రధానంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆయాలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేసే నైట్ వాచ్‌మెన్‌లు, తదితరులు దృష్టి సారించాలన్నారు. ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సెక్రటరీ నోడల్ అధికారులుగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సాయంత్రం రెండు గంటలు అక్షరాస్యత తరగతులకు అందుబాటులో ఉంచాలని మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీని ఆదేశించారు.

ప్రిన్సిపాల్‌కు అభినందన



శ్రీనివాసరావును అభినందిస్తున్న మేనేజ్‌మెంట్ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సిస్ ఇండియా నీతి అయోగ్ అందచేసే ఎక్సలెన్స్ ఇన్ లీడర్‌షిప్ అండ్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి వర్చువల్ సదస్సులో ఈ అవార్డును ప్రకటించారు. విద్యా ప్రగతి, సాంకేతిక విద్య, గ్రామీణ విద్యకు సంబంధించి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను మేనేజ్‌మెంట్ సభ్యులు దుర్గాప్రసాదరావు, వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సిబ్బంది మంగళవారం అభినందించారు.

గ్రామాల్లో వారాల సందడి



పత్రి కొమ్మల పూజ చేస్తున్న రైతులు

గార : మండలంలోని పలు గ్రామాల్లో గౌరీ పౌర్ణమి, దసరా వారాల పండగలతో సందడి నెలకొంది. గ్రామదేవత అసిరితల్లికి ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. మండల కేంద్రం గారలో మంగళవారం రైతులు పత్రి కొమ్మలకు పూజలు చేసి పొలాల్లో నాటారు. గ్రామదేవతలకు పూజలు చేశారు. పంటలు బాగా పండాలని, రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.

ఈ-పంట జాబితాల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల వారీగా రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట జాబితాలకు సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఏవో వై.సురేష్ చెప్పారు. మంగళవారం తోటపాలెంలోని జాబితాలను పరిశీలించారు. అన్ని గ్రామాల్లో రైతులు జాబితాలు పరిశీలించాలని, లోపాలు ఉంటే వ్యవసాయ సహాయకుల దృష్టికి తీసుకువెళితే సరిచేస్తారని చెప్పారు.

వరి తెగుళ్లపై అప్రమత్తం

రణస్థలం: వాతావరణంలో మార్పుల దృష్ట్యా వరిలో తెగులు, పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి డి.విజయభాస్కర్ అన్నారు. మంగళవారం కృష్ణాపురం, రావాడ పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవన అధికారి అనూష మాట్లాడుతూ పంటల్లో యాజమాన్య పద్ధతులు, చీడపీడల యాజమాన్యంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

యోగా విజేతకు అభినందనలు

శ్రీకాకుళం అర్బన్: ఈ నెల 5, 6, 7 తేదీల్లో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో శ్రీకాకుళం జిల్లా తరఫున గుంట జ్యోతి పాల్గొని ఐదో స్థానంలో నిలిచి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసిందని శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీలోగల పార్కు యోగా సెంటర్ శిక్షకురాలు జి.నాగలక్ష్మి అన్నారు. జ్యోతిని మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో నేషనల్ యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో జ్యోతి ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్ ఎంపికలు నేడు

ఎచ్చెర్ల క్యాంపస్: న్యూఢిల్లీలో జనవరి 26న నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే జాతీయ సేవా పథకం వలంటీర్ల ఎంపిక బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎం.అనురాధ మంగళవారం చెప్పారు. వర్సిటీ క్రీడా మైదానంలో తెలుగు రాష్ట్రాల రీజనల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు నిర్వహించనున్నట్లు వివరించారు. వర్సిటీ, అఫిలియేషన్ కళాశాలల వలంటీర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

‘బోరు’మంటున్నా..

పట్టించుకోరా?

- నగర పరిధిలో వృథాగా హ్యాండ్ బోర్లు
- వీధి మలుపుల్లో ఉండటంతో తరచూ ప్రమాదాలు



రాజీవ్‌స్వగృహ సముదాయం వద్ద రోడ్డు మధ్యలో బోరు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

నగర పరిధిలోని పలు వీధుల్లో హ్యాండ్ బోర్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. చాలా చోట్ల ఉపయోగంలో లేక ‘బోరు’మంటున్నాయి. కొందరు ఏకంగా బోర్లకు పార్టీ రంగులు పూసి అడ్వర్టైజింగ్ కోసం ఉపయోగించుకుంటున్నారు. మరికొన్ని చోట్ల సమీపంలోని మురుగుకాలువలు పూడికతో నిండిపోవడంతో బోర్ల నుంచి కలుషిత నీరు వస్తోంది. చాలావరకు వీధి శివారు మలుపుల్లో ఉండడంతో బోరు హ్యాండిల్ తగిలి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో చిన్నారులు, వృద్ధులు గమనించకపోవడంతో హ్యాండిల్ తగిలి గాయపడుతున్నారు. మరికొన్ని చోట్ల బోరు హెడ్ తీసి ఉండడంతో చిన్న చిన్న కుక్కపిల్లలు పడిపోయి మృత్యువాతపడుతున్నాయి. నగరంలో దాదాపుగా అన్ని వీధుల్లో మున్సిపల్ కుళాయిలు ఉండడంతో చేతిపంపుల అవసరం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవసరంలేని చోట బోర్లు తొలగించి ప్రమాదాల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాలకు గురవుతున్నారు



నగరంలో అందరికి కుళాయి కనెక్షన్లు ఉండడంతో హ్యాండ్ బోర్లు నిరుపయోగంగానే ఉన్నాయి. వీధి కార్నర్స్‌లో ఉండడంతో గమనించని చిన్నపిల్లలు, వృద్ధులు బోరు హ్యాండిల్స్ తగిలి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి అవసరం లేని చోట తొలగించి ప్రమాదాల నుంచి రక్షించాలి.

– వానపల్లి రమేష్, శాలివీధి, శ్రీకాకుళం

ఎక్కడెక్కడంటే..

ఫాజుల్‌బాగ్‌పేట, రాజీవ్ స్వగృహ సముదాయం, చేపలవీధి, దమ్మలవీధి, వైష్ణవవీధి, కృష్ణాపార్కు, పుణ్యపువీధి, హయాతీనగర్, దంగలవీధి, శాలివీధి, శాంతినగర్‌కాలనీ, బలగ, కుమ్మరవీధి, ఆదివారంపేట, చిన్నబరాటంవీధి, డీసీసీబీ కాలనీ, గోల్కొండ రేవువీధి, పాతబస్టాండ్, జెండాల వీధి, మంగువారితోట, విశాఖ-ఏ,బీ కాలనీ శివారు ప్రాంతాలు బోర్లు నిరుపయోగంగా ఉంటున్నాయి.




శాలివీధిలో కాలువను ఆనుకుని ఉన్న హ్యాండ్‌బోరు దుస్థితి



చిన్నబరాటం వీధిలో అలంకారప్రాయంగా..

అలంకరణ



బలగలోని భద్రమ్మతల్లి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ముర్రాట్లు సమర్పించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. –శ్రీకాకుళం కల్చరల్

అభినందన



అధ్వాన్నంపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కూర్మాన అరుణకుమారి ఉమెన్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ తరఫున ఉమెన్ ఐకాన్–2024 అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో ప్రతినిధులు అభినందించారు. –జి.సిగడాం

తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద గేట్‌మీటింగ్ నిర్వహిస్తున్న తపాలా ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: తపాలా ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తపాలా ఉద్యోగుల జాయింట్ కౌన్సిల్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. పోస్టల్ ఉద్యోగుల దశల వారీ పోరాటంలో భాగంగా మంగళవారం శ్రీకాకుళంలోని తపాలా సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ఉద్యోగ సంఘాలన్నీ కలిసి జాయింట్ కౌన్సిల్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్‌గా ఏర్పడి సమస్యల పరిష్కారం కోసం గేట్‌మీటింగ్ నిర్వహించారు. గత ఏడాది ఏప్రిల్ 26న రద్దు చేసిన ఎన్ఎఫ్‌పీఈ, ఏఐపీఈయూ సంఘాల గుర్తింపును పునరుద్ధరించాలని, ఈ ఏడాది ఏప్రిల్ 12న ఎన్ఎఫ్‌పీఈ, ఏఐపీఈయూ గ్రేడ్-సి సంఘాల గుర్తింపు రద్దు విషయంలో జార్ఖండ్ హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్‌ను తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రూప్-సి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.గణపతి, పోస్టుమేన్ యూనియన్ జిల్లా కార్యదర్శి బాబూరావు, జీడీఎస్ సంఘం జిల్లా నాయకులు బెవర అప్పారావు, పి-3 అధ్యక్షులు యు.వి.రమణ, పి-4 అధ్యక్షులు వేంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వాన శ్రీనివాసరావు, గురన్న, రామకోటి, అసిరయ్య పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో సిక్కోలు హవా





సత్కారం అందుకున్న వర్షిత, తరుణ్

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు జరిగిన ఆలిండియా నేషనల్స్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో గుజ్జల వర్షిత, ముద్దాడ తరుణ్ మూడు పతకాలు సాధించారు. టోర్నీ ముగించుకుని మంగళవారం జిల్లాకు వచ్చిన వీరిని డీఎస్ఏ కార్యాలయంలో డీఎస్‌డీఓ డాక్టర్ శ్రీధర్‌రావు, జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇంజరాపు భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి కొత్తకోట శ్రీనివాసరావు, డీఎస్ఏ వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ ఇప్పిలి అప్పన్న, జి.హిమగిరి సత్కరించారు. కోచ్ అప్పన్నను అభినందించారు. గుజ్జల వర్షిత స్వగ్రామం అంపోలు సమీపంలోని ఆడవరం. ప్రస్తుతం శారద కళాశాలలో డిగ్రీ ఫస్టియర్ చదువుతోంది. తండ్రి గుజ్జల హిమగిరి మాజీ ఎంపీటీసీ కాగా, తల్లి రమణమ్మ గృహిణి. ముద్దాడ తరుణ్ స్వగ్రామం పెద్దపాడు సమీపంలోని తంగివానిపేట. విశాఖపట్నం బుల్లయ్య కళాశాలలో డిగ్రీ ఫస్టియర్ చదువుతున్నాడు. తండ్రి ముద్దాడ సూర్యారావు రైల్వే ఉద్యోగి. తల్లి అప్పన్న గృహిణి.

నీటి తీరువా వసూలు వేగవంతం చేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: నీటితీరువా వసూళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, పంచాయతీరాజ్, ఉపాధి, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నీటి సంఘాల ఎన్నికలు త్వరితగతిన నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ అప్పారావు, వ్యవసాయాధికారి త్రినాథస్వామి, డీపీఓ భారతీ సౌజన్య, డీఆర్‌డీఏ, డ్వామా అధికారులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ‘స్పాట్ అడ్మిషన్లు’

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో పీజీ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 17 నుంచి 22 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కింతలి సూర్యచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ తెలుగులో 29 సీట్లు, ఎమ్మెస్సీ జువాలజీలో 19 సీట్లు, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో 11 సీట్లు, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌లో 3 సీట్లు చొప్పున ఖాళీలు ఉన్నట్టు వివరించారు. ‘ఏపీ పీజీసెట్– 2024’లో క్వాలిఫై అయిన వారు డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, స్టడీ , ఏపీపీజీ సెట్ 2024 ర్యాంక్ కార్డ్, కుల, రెసిడెన్సీ, ఈడబ్ల్యూఎస్, టీసీ తదితర ధ్రువపత్రాలతో సంప్రదించాలన్నారు.

అభ్యసన వైకల్యంపై అవగాహన



శ్రీకాకుళం న్యూకాలనీ: ర్యాలీ నిర్వహిస్తున్న డీవైఈఓ విజయకుమారి, గోవిందరావు, ప్రభాకర్



గార: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



రణస్థలం: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



జి.సిగడాం: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం న్యూకాలనీ: అభ్యసనలో ఎదురవుతున్న లోపాలను గుర్తించేలా విద్యార్థులకు విషయ పరిజ్ఞానాన్ని తెలియజేయాలని శ్రీకాకుళం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి తెలిపారు. జిల్లా విద్యాశాఖ– సమగ్రశిక్ష సంయుక్త ఆధ్వర్యంలో నిర్దిష్ట అభ్యసనా వైకల్యాల(డిస్లెక్సియా) జరుగుతున్న అవగాహన వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం శ్రీకాకుళం నగరంలోని భవిత కేంద్రం విద్యార్థులతోపాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష– సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు, సీఎంఓ పేడాడ ప్రభాకరరావు, స్పెషల్ ఎడ్యుకేటర్ జి.గోవిందరావు, భవిత కేంద్రం టీచర్లు కుసుమ, చెల్లమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గార : దివ్యాంగ చిన్నారుల్లో అభ్యసన వైకల్యంపై తల్లిదండ్రులకు, ప్రజల్లో అవగాహన కలిగించాలని గార మండల ఎంఈవోలు ఎస్.రామకృష్ణ, పి.వినోదిని అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు భవిత కేంద్రం ఆధ్వర్యంలో డిస్లెక్సియా వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. చదువుకోవడంలో సమస్య ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రత్యేక పద్ధతుల్లో శిక్షణ ఇవ్వడం కోసం గుర్తింపు కార్యక్రమం చేపట్టాలన్నారు. సాధారణ పిల్లలకు దీటుగా నేర్చుకునేలా వారిలో నైపుణ్యాలను కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, అన్నపూర్ణ, ఏ.రఘులక్ష్మీ, ఎల్.అమ్మాజీ, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

రణస్థలం: డిస్లెక్సియా అనేది చదువగలిగిన దానికన్న తక్కువగా చదివేలా చేసే వ్యాధి అని రణస్థలం ఎంఈవో ఎ.త్రినాథరావు అన్నారు. మండల కేంద్రంలోని జె.ఆర్.పురం హైస్కూల్లో విద్యార్థులకు డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిస్లెక్సియా అనేది వేర్వేరు వ్యక్తులలో వేర్వేరు స్థాయిల్లో ఉంటుందని, పదాలను సరిగా పలకకపోవడం, రాయకపోవడం, తొందరగా చదవలేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయని చెప్పారు. ఇటువంటి సమస్యలతో బాధపడే విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాఠ్యాంశాలు బోధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జె.ఆర్.పురం హెచ్‌ఎం, భవిత ఉపాధ్యాయులు ఎం.బాలరాజు, ఎం.రూపాదేవి, స్పెషల్ ఎడ్యుకేటర్ ఎం.డి.జె.బేగం తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: లావేరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం అభ్యసన వైకల్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.జగన్నాథరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జి.సిగడాం: ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద మంగళవారం ప్రపంచ డిస్లెక్సియ వ్యాధిపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, సీఎంఓ పేడాడ ప్రభాకరరావు, హెచ్‌ఎం చీర రాము, స్పెషల్ ఎడ్యుకేటర్లు అర్జున, కృష్ణ, మాధురి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ న్యూసెన్స్

- కటకటాల్లోకి నెట్టిన పోలీసులు
- రౌడీలను ఉపేక్షించేది లేదన్న ఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న సీఐ పైడపునాయుడు, ఎస్ఐ హరికృష్ణ

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో ఓ రౌడీషీటర్ న్యూసెన్స్ చేశాడు.. నడిరోడ్డుపై మద్యం సేవించి హల్‌చల్ చేశాడు.. ఇది జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే ఒకటో పట్టణ పోలీసులు రౌడీషీటర్‌ను అదుపులోకి తీసుకుని కటకటాల్లోకి నెట్టారు. ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడు, ఎస్ఐ హరికృష్ణ విలేకరులకు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రాత్రి బలగ మురళీకృష్ణ అనే రౌడీషీటర్ బహిరంగ ప్రదేశంలో మద్యం పూటుగా సేవించి అటుగా వచ్చే ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగించాడు. సమాచారమందుకున్న ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని రౌడీషీటర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డికి అప్పటికే సమాచారం అందడంతో ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదని, న్యూసెన్సు చేసేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం ఉదయం మురళీకృష్ణను పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. శ్రీకాకుళం రెండో క్లాస్ మెజిస్ట్రేట్ శివరామకృష్ణ 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. ఇదివరకే మురళీకృష్ణపై ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ తెరిచి ఉందని ఎస్ఐ పేర్కొన్నారు.

గౌరీపౌర్ణమి వేడుకలు ప్రారంభం

ఫరీదుపేటలో గౌరీ పౌర్ణమి వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకల్లో తొలిరోజు గౌరీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగించారు. మహిళలు గౌరీ నోములు నోచారు. తప్పెటగుళ్లు, గరిడీ, భజన తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గ్రామంలో శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్



గౌరీదేవికి పూజలు చేస్తున్న గ్రామస్తులు



భజన చేస్తున్న భక్తులు



తప్పెటగుళ్ల ప్రదర్శన

అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు తప్పనిసరి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో మరుగు దొడ్లు నిర్మించి వాడుకలోకి తీసుకురావాలని ఎంపీడీవో సీపాన హరహరరావు స్పష్టం చేశారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్ కాలనీల్లో అసంపూర్తి ఇళ్ల పూర్తిచేయటంపై దృష్టి సారించాలన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ డీఈ అప్పారావు, సీడీపీవో డి.పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలాం జీవితం స్ఫూర్తిదాయకం



శ్రీకాకుళం అర్బన్: కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల క్యాంపస్: పుస్తక ఆవిష్కరణలో వీసీ రజని, వర్సిటీ అధికారులు



ఎచ్చెర్ల: లావేరు పాఠశాలలో కలాం విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది



శ్రీకాకుళం అర్బన్: కేంద్ర గ్రంథాలయంలో కలాం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం న్యూకాలనీ: ఎన్‌సీఎస్ స్కూల్‌లో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బి.మల్లేశ్వరరావు, పి.శ్రీకాంత్, ఉపాధ్యాయులు

శ్రీకాకుళం అర్బన్: ఉన్నత వ్యక్తిత్వంతో పాటు దేశం పట్ల అపారమైన భక్తి కలిగిన మహామనిషిగా ప్రపంచానికి ప్రభావితం చేసిన శక్తివంతుడు, భారతరత్న ఏ.పి.జె.అబ్దుల్ కలాం చిరస్మరణీయుడని వక్తలు పేర్కొన్నారు. కలాం జయంతి సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. కలాం విగ్రహ దాతలు బరాటం శ్రీరామ్మూర్తి, బరాటం లక్ష్మణరావుతో పాటు గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు జామి భీమశంకర్, సురంగి మోహన్రావు, నటుకుల మోహన్, కొంక్యాన వేణుగోపాల్ బృందం కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు పొన్నాడ రవికుమార్, మెట్ట అనంతంభట్లు, నక్క శంకరరావు, టెక్కం రాంగోపాల్, కొమ్ము రమణమూర్తి, శాస్త్రి, కృష్ణారావు, రాజారావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: లావేరు పాఠశాల ఆవరణలో అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం పి.జగన్నాథరావు కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మీసాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: అబ్దుల్ కలాం యువతకు ఆదర్శప్రాయుడని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కె.ఆర్.రజిని అన్నారు. కలాం జయంతి సందర్భంగా మండపల్లి రామకృష్ణారావు రాసిన ‘మానవత్వం మూర్తీభవించిన మహామనిషి ఏపీజే అబ్దుల్ కలాం’ అన్న పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ బి.అడ్డయ్య, అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కలాం జయంతి ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజా పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, సిబ్బంది ప్రత్యూష, రాంబాబు, రామ్మోహన్, విశ్రాంత జూనియర్ అసిస్టెంట్ చిరంజీవులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: కలాం సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని వివిధ విద్యాసంస్థల్లో మంగళవారం కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జి.సిగడాం: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణ అన్నారు. మంగళవారం మెట్టవలసలో పల్లెపండగలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కామోజుల ఆరుద్ర, కుమరాపు రవికుమార్, బెవర విజయలక్ష్మి, సీతారాం, జగన్నాథం, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.